# సాక్షి ఒడిశా

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025




**తాత్కాలికంగా శ్రీమందిరం మూసివేత**

కొరాపుట్: పూరీ శ్రీ మందిరంను తాత్కాలికంగా మూసి వేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 10 గంటల వరకు మూసి వేసి ప్రత్యేక శుద్ధి కార్యక్రమాలు చేశారు.



**మంచం కింద భార్య శవం**

హల్ది గ్రామంలో మంచం కింద భార్య శవం దొరికింది. భర్త పరారీలో ఉన్నాడు.

- 8లో▸



**పూర్తయిన డబ్లింగ్**

కొత్తవలస-కిరండోల్ మధ్య డబ్లింగ్ పూర్తయ్యాయి. 85 కిలోమీటర్ల మేర పనులు జరిగాయి.

- 8లో▸

## న్యూస్‌రీల్

### ప్రధాని చేతులమీదుగా కొరాపుట్ కలెక్టర్‌కు అవార్డు



ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్

కొరాపుట్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ అవార్డు అందుకున్నారు. సోమవారం సివిల్ సర్వీస్ డే సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. వేదిక మీద ద ప్రైమ్ మినిస్టర్స్ అవార్డు ఫర్ ఎక్సెలెన్స్ అవార్డుని ప్రధాని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 11 పథకాలను జిల్లాలో ప్రజల వద్దకు చేర్చడంలో కీర్తివాసన్ కృషి చేసినందుకు ఈ అవార్డు లభించింది.

### వంశధారలో చేప పిల్లల విడుదల



నదిలో చేపలను విడుదల చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న వంశధార నదిలో సోమవారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో 7.50 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో హాజరయ్యారు. దీనివలన చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న ఎంతోమందికి మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రప్రథమంగా ఈ తరహా ప్రక్రియను మత్స్యశాఖ చేపట్టడంతో అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, సమితి సభ్యులు, స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### దివ్యాంగుడి నిరసన



ఆందోళన చేస్తున్న జేమ్స్

పర్లాకిమిడి: ఈ నెల 11న పర్లాకిమిడి నుంచి గురండి గ్రామానికి మారుతి అనే ప్రైవేటు బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు టికెట్‌పై రాయితీ ఇవ్వలేదని ప్రశ్నించినందుకు బస్సు నుంచి గెంటేశారని, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపిస్తూ ఫ్రెండ్స్ కాలనీకి చెందిన దివ్యాంగుడు వి.జేమ్స్ సోమవారం ఆదర్శ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టాడు. పర్లాకిమిడి తహశీల్దారు, గురండీ పోలీసులు తనపై అన్యాయంగా కేసులు పెట్టి హింసించినందుకు వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

### చోరీ కేసులో నలుగురు అరెస్టు

రాయగడ: జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహరో నివసిస్తున్న వసతి గృహంలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో చింతాడ చిరంజీవి, సామల్ స్వాయి, బి.సంతోష్ కుమార్, ఉలక సంతోష్‌లు ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి ఐఐసీ కేకేబీకే కుహరో తెలిపిన వివరాల మేరకు ఈనెల 15వ తేదీన స్థానిక రాణిగుడ ఫారం సమీపంలోని జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహరో నివసిస్తున్న ప్రభుత్వ వసతి గృహంలో గుర్తు తెలియని దుండగులు చోరీయత్నం చేశారు. వసతి గృహం గేట్‌ను విరగ్గొట్టి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే బయట అలికిడి జరగడంతో దుండగులు వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న అదనపు కలెక్టర్ కుహరో ఈ మేరకు సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

జయపురం: జయపురంలో దొంగతనంగా గంజాయి అమ్ముతున్న ఒక వ్యక్తిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి వర్గాలు నేడు తెలిపాయి. జయపురం సూర్యమహల్ ప్రాంతానికి చెందిన సూరజ్ సింగ్(20)ను ఐదుగురు సభ్యులు గల ఒక టీమ్ ఆదివారం జయపురం స్థానిక పోలీసుల సహకారంతో పట్టుకుని కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆదేశం మేరకు సూరజ్‌ను తమిళనాడుకు తీసుకు పోయారు. 2024 డిసెంబర్‌లో జరిగిన వాహన తనిఖీల్లో సూరజ్ పోలీసులకు దొరికాడు. అప్పట్లో తమిళనాడు పోలీసుల నుంచి అతడు తప్పించుకుని పారిపోయాడు. ఎట్టకేలకు ఇప్పుడు దొరికాడు.



మీకు నేనున్నా...



సిబ్బంది వలే ప్రజా సమస్యలు నమోదు చేసుకుంటున్న మంత్రి సూరజ్ సూర్య వంశీ



ఓపికతో వింటూ...

# ప్రజల్లోకి ముఖ్యమంత్రి

- తొలిసారి రాజధాని బయట గ్రీవెన్స్‌సెల్
- సంబల్‌పూర్‌లో వినతులు స్వీకరించిన సీఎం మోహన్‌చరణ్ మాఝి
- హాజరైన 11 మంది క్యాబినెట్ మంత్రులు



వృద్ధుల సమస్యలు వింటున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

కొరాపుట్: ప్రజల కోసమే రాజధాని వదిలి సంబల్‌పూర్ వచ్చామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. సోమవారం సంబల్‌పూర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో సీఎంను కలవాలంటే మహానుభావులకే తపస్సు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తాము మాత్రం సీఎంను కలవలేని వారి కోసం ప్రజల్లోకే వచ్చామన్నారు. ఒక్కరోజే సుమారు 6 వేల మంది సమస్యలు పరిష్కరించామన్నారు. ఎక్కువగా సంబల్‌పూర్, బరగడ్ జిల్లాల ప్రజల నుంచే వచ్చాయన్నారు. ఇప్పటి వరకు తాను సీఎం అయిన తర్వాత 10 నెలలలో రాజధానిలో తొమ్మిది సార్లు గ్రీవెన్స్‌సెల్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతిసారీ వెయ్యికి పైగా సమస్యలు పరిష్కరించామన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రజల్లోకి వచ్చి వినతులు స్వీకరించడం ఇదే తొలిసారన్నారు. ఈ అవకాశం ఇచ్చిన సంబల్‌పూర్ సమలేశ్వరి దేవి కృతజ్ఞతగా ఉంటానన్నారు. భవిష్యత్‌లో ప్రతి జిల్లాలోనూ గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామన్నారు.



హాజరైన దివ్యాంగులు

**భారీగా ఏర్పాట్లు..**

రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మోహన్ చరణ్ మాఝి తొలిసారి బయట ప్రాంతంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్‌సింగ్‌దేవ్, 10 మంది క్యాబినెట్ మంత్రులు, పదుల సంఖ్యలో ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరై సామాన్య ప్రజలకు సేవలందించారు. సంబల్‌పూర్‌తో పాటు పశ్చిమ ఒడిశాలో అనేక జిల్లాల నుంచి వందలాది మంది ప్రజలు హాజరై సమస్యలు విన్నవించుకున్నారు. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి సీఎం సమస్యలు వినడం ప్రత్యేకంగా నిలిచింది. మంత్రులు కూడా సాధారణ ప్రభుత్వ సిబ్బంది వలే పెన్నులు తీసుకొని వివరాలు నమోదు చేసుకోవడం గమనార్హం. ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, మంత్రులు సూరజ్ సూర్యవంశీ, నిత్యానంద గొండో తదితరులు సీఎం పక్కనే ఉండి సహాయం చేశారు.



తరలివస్తున్న మంత్రుల బృందం

## సమస్యల కొలువు



వాగు నుంచి తాగునీరు సంగ్రహిస్తున్న మహిళలు



రహదారి లేకపోవడంతో నడకమార్గం

రాయగడ: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన సమితిగా గుర్తింపు పొందిన కాసీపూర్‌లో సమస్యలు కొలువుదీరాయి. ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు లభించడం లేదు. సమితిలో సుమారు 482 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాజెక్టులు, పథకాలు అమలు చేస్తున్నా వాటి వలన ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పటికే ఈ సమితిలో సరైన రహదారులు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సౌకర్యాలు అందని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. గొడుబల్లి పంచాయతీలోని తిడిగుడ, పొడులుగుడ, లేఖాపాయి గ్రామాల్లో తాగునీటికి హాహాకారాలు చేస్తున్నారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు వందకు పైబడిన ఆదివాసీ కుటుంబాలు నివసిస్తున్నాయి. అసలే వేసవికాలం కావడంతో వాగునీటిపై ఆధారపడే ఈ గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి తీవ్రతకు వాగులు ఎండిపోవడంతో గుక్కెడు నీటికి కటకటలాడుతున్నారు. అదేవిధంగా రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వీరి దరికి చేరలేకపోతున్నాయి. పీడీఎస్ బియ్యం, పెన్షన్ వంటివి తీసుకునేందుకు ఆరు కిలోమీటర్ల దూరం కాలినడకే వీరికి శరణ్యం. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా గ్రామాల వరకు చేరడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గ్రామాలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్రపతి పాలన విధించాలి



ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు



డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండాకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై అత్యాచారాలు, దాడులు ఆపాలని, అక్కడ శాంతిభద్రతలు క్షీణించడం వలన రాష్ట్రపతి పాలన విధించాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ శ్రేణులు కోరాయి. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. హిందువులపై దాడులు జరుగుతున్నా, అక్కడి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు లోకనాథ మిశ్రా, అధ్యక్షుడు కై లాస్ చంద్ర గౌడో, కూర్మారెడ్డి, హరిమోహన్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాలతోనే వైద్య కళాశాల సాధించాం



ఎమ్మెల్యేతో మెడికల్ విద్యార్థులు



బాహిణీపతికి స్వాగతం పలుకుతున్న విద్యార్థి సంఘం నాయకులు

కొరాపుట్: ఉద్యమాలతోనే కొరాపుట్‌లో ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల సాధించామని జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి ప్రకటించారు. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో జరిగిన వైద్య విద్యార్థుల యూనియన్ నిర్వహించిన వార్షికోత్సవ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కళాశాల ఏర్పాటు కోసం తాము అనేక ఉద్యమాలు చేశామన్నారు. నాడు న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద 7 రోజులు ఆందోళన చేసిన విషయం గుర్తు చేశారు. ప్రస్తుతం కళాశాల సమస్యలు పరిష్కారం కోసం విద్యార్థులు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు కళాశాల ఆవరణలో ఉన్న లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేదిక మీద ఒడిస్సీ నృత్య ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో కళాశాల డీన్ సుకాంత్ సాహు, డాక్టర్ జయంత్ పండా, యూనియన్ సలహాదారుడు డాక్టర్ ప్రతిప్ కుమార్ జెన్నా, విద్యార్థి సంఘం అధ్యక్షుడు బాదల్ కుమార్, కార్యదర్శి హిమాంశ్ దాస్ పాల్గొన్నారు.

## విప్పపువ్వు అక్రమ రవాణా



స్వాధీనం చేసుకున్న విప్పపువ్వు, బియ్యం బస్తాలు

రాయగడ: బియ్యం బస్తాల మాటున విప్పపువ్వును అక్రమంగా తరలిస్తున్న ఒక పికప్ వ్యాన్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవర్ చంద్రగౌరడను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎక్సైజ్ శాఖ ఓఐసీ సంజయ్ కుమార్ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. నాటుసారా తయారీకి వినియోగించే విప్పపువ్వు అక్రమంగా తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు స్థానిక మజ్జిగౌరి మందిరం వద్ద సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రాయగడ మీదుగా శిఖాల్ వైపు వెళ్తున్న ఒక పికప్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. దీంతో అందులో 600 క్వింటాళ్ల బియ్యం బస్తాలు కనిపించాయి. అయితే అధికారులు లోతుగా తనిఖీ చేయగా బియ్యం బస్తాల కింద 900 క్వింటాళ్ల విప్పపువ్వు బస్తాలు బయటపడ్డాయి. అదేవిధంగా తనిఖీల్లో భాగంగా మందిరం చెక్‌గేట్ వద్ద నాటుసారా తరలిస్తున్న కె.అనిల్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 7 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎ.అప్పలరాజు అనే వ్యక్తి విదేశీ మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 7 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

## రైళ్ల రాకపోకలకు అంతరాయం



విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు



పట్టాలపై విరిగి పడిన చెట్లు



కొరాపుట్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల పాట్లు



ఆలస్యంగా చేరిన హిరాఖండ్ రైలు

కొరాపుట్:

కొత్తవలస - కిరండోల్ రైల్వేమార్గంలో మరోసారి రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జగదల్‌పూర్ - జయపూర్ స్టేషన్ల మధ్య కొడప రైల్వేస్టేషన్ సమీపంలో విద్యుత్ వైర్లపై చెట్లు పడిపోయాయి. దీంతో ఆ మార్గంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా జగదల్‌పూర్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌ని కుసిమి వద్ద నిలిపివేశారు. సహాయక చర్యల అనంతరం మరలా రైళ్లని పునరుద్ధరించారు. సుమారు 3 గంటల పాటు రైలు ఆలస్యం కావడంతో జయపూర్, కొరాపుట్ రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు పడిగాపులు కాశారు. గత నాలుగు రోజుల్లో కొరాపుట్, రాయగడ జిల్లాల్లో వరుసగా 3 సార్లు ఇదే సమస్యలతో రైళ్లు నిలిచిపోయాయి.

## కాలవైశాఖి బీభత్సం



బొరిగుమ్మ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కూలిన భారీ వృక్షం



నారాయణ పట్న సమితిలో కూలిన వృక్షం



ఎగిరి పడిన వాటర్ ట్యాంక్




సహాయం కోసం బాధితుల ఎదురు చూపులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో కాల వైశాఖి బీభత్సం సృష్టించింది. సోమవారం బొరిగుమ్మ, నారాయణ పట్న, లక్ష్మీపూర్ సమితుల్లో ఉధృతమైన గాలులతో కూడిన వానలు పడ్డాయి. బొరిగుమ్మ సమితి కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో భారీ వృక్షం కూలిపోయింది. లక్ష్మీపూర్, నారాయణ పట్న సమితుల్లో గాలులకు భారీ వృక్షాలు కూలిపోయాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గాలులకు 25 ఇళ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు కూడా విరిగి పడ్డాయి.

**జయపురం సబ్‌డివిజన్‌లో..**

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కాల వైశాఖి కలకలం రేపింది. జయపురం పట్టణంతో పాటు కుంధ్ర, బొయిపరిగుడ మొదలగు ప్రాంతాల్లో వానలు పడ్డాయి. జయపురంలో మెయిన్ రోడ్డులో ఉరుములతో కూడిన వానకు జనం భయపడ్డారు. పట్టణంలో చాలాసేపు విద్యుత్ అంతరాయం కలిగింది. జయపురం సమితి జాముండ పంచాయతీ, మాలిడొంబుగుడలోని పురుసతి హరిజన్ ఇళ్ల పై కప్పులు ఎగిరిపోయాయి. మలదా, బొడొపాడ, జాముండ మొదలగు ప్రాంతాల్లో పలు చెట్లు నేల కూలాయి. మఝిగుడ గ్రామంలోని సబిత పౌరజ ఇల్లు కూలిపోయింది. రామగిరి, దండిబడి, హల్దికుండ్,గుప్తేశ్వరలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.



మాలిడొంబుగుడలో పెనుగాలులకు పైకప్పు ఎగిరి పోయిన ఇల్లు



బొయిపరిగుడ మఝిగుడ లో..

## క్లుప్తంగా

### 25న టేకు కలప బహిరంగ వేలం

టెక్కలి: ఈ నెల 25న టెక్కలి కోర్టు సముదాయంలో టేకు కలప బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కోర్టు వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. వివిధ కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.47,872 (ప్రభుత్వ విలువ) విలువ కలిగిన 21 రకాల వివిధ సైజులు కలిగిన టేకును బహిరంగ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల సమక్షంలో ఉదయం 10:30 గంటల నుంచి నిర్వహిస్తున్న ఈ వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

### 12 మందికి శ్రీశ్రీ వేదిక పురస్కారాలు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్య, కళా రంగాల్లో పలు రికార్డులు సాధించిన 12 మందికి శ్రీశ్రీ కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించబోయే ప్రపంచ తెలుగు సంబరాల్లో శ్రీశ్రీ వేదిక పురస్కారాలను అందిస్తున్నారు. మే నెల 10,11 తేదీల్లో నిర్వహించే ఈ సంబరాలకు జిల్లా నుంచి 12మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహక సంస్థ సమన్వయకర్త ఈవేమన ఓ ప్రకటనలో తెలిపారు. జంధ్యాల శరత్ బాబు (తెలుగు భాష), కుమారనాయక్, ఎం.శ్రీరాములు (తెలుగు కీర్తి), రఘుపాత్రుని శివ, పి. ముకుందరావు (యువకీర్తి), గౌరీపతిశాస్త్రి (అక్షర తేజం), జె.వి.తిరుమలాచార్యులు (కళాకిరీటి), మహ్మద్ రఫీ (కళారత్న), మూల తాతయ్య (శ్రీశ్రీ ప్రతిభా పురస్కారం), మాతృదేవోభవ పురస్కారాలను బోడవరపు వెంకటలక్ష్మీ, గంపా శ్రీదేవి, డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవిలకు ప్రకటించారని తెలిపారు.

### 26న ముఖ్యమంత్రి పర్యటన



స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అధికారులు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బుడగుట్లపాలెం మత్స్యకార గ్రామంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఈ నెల 26న పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించి మత్స్యకార భరోసా (వేట నిషేధ భృతి) అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, తహసీల్దార్ బి.గోపాలరావుతో కూడిన అధికారులు సోమవారం ఏర్పాట్లపై సమీక్షించారు. స్థలం పరిశీలించి సభ ఏర్పాటుపై చర్చించారు.

### రెండు గంటల నిరీక్షణ



కాశీబుగ్గ గేటు ముందు నిరీక్షిస్తున్న ప్రయాణికులు, బారులు తీరిన వాహనాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ప్రయాణికులు సోమవారం నరకయాతన పడ్డారు. రైలు పట్టాల కింద కొత్త స్లీపర్‌లు వేశారు. దీని కోసం ప్రత్యేకమైన రైలు రావడంతో సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఏడున్నర గంటల వరకు పనులు చేపట్టారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో వాహనదారులు అంత సేపూ వేచి ఉండాల్సి వచ్చింది. ఆఖరుకు నర్సిపురం, కిష్టుపురం ప్రాంతాల మీదుగా ప్రయాణించారు.

### బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో గాయాలతో దేవరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కేటీ రోడ్డు మోర్ స్టోర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. యు టర్న్ తీసుకునే సమయంలో రెండు బైక్‌లు ఎదురెదుగా ఢీకొట్టడంతో చిత్రాడ దేవరాజు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. తక్షణమే స్థానికులు 108 ప్రభుత్వ వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

### డీఎస్పీ మూర్తికి సత్కారం



రిటైరైన డీఎస్పీని సత్కరిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని, అలాంటి క్రమశిక్షణ నిబద్ధత గల అధికారి డీఎస్పీ డిఎస్‌ఆర్‌వీ ఎస్ఎన్ మూర్తి అని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. టెక్కలిలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన మూర్తిని నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, వీవీ అప్పారావు, శేషాద్రి పాల్గొన్నారు.

# సమలేశ్వరిని దర్శించుకున్న సీఎం



సమలేశ్వరి ఆలయం ఆవరణలో సహచర మంత్రులతో సీఎం



సమలేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న సీఎం మోహన్ చరణ్ మఝి

కొరాపుట్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి సంబల్‌పూర్ జిల్లా కేంద్రంలోని పశ్చిమ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం మా సమలేశ్వరి శక్తి పీఠాన్ని దర్శించుకున్నారు. సహచర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, స్థానిక ఎమ్మెల్యే జయనారాయణ మిశ్ర లు సీఎంతో బ్యాటరీ కార్‌తో గర్భగుడి వద్దకు చేరుకున్నారు. వేద పండితులు ఆలయ మర్యాదలతో సీఎంని అమ్మవారి దర్శనం చేయించారు.

## పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే, ఎంపీలు



అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులతో ఆటలాడుకుంటున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి

కొరాపుట్: పాఠశాలల పనితీరుని నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మఝి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి వేర్వేరుగా సందర్శించారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని పడాల్‌గుడ, నీలకంఠ గుడ అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే గౌరీ శంకర్ సందర్శించారు. పిల్లలకు ఇచ్చే ఆహారం, వసతులు అడిగి తెలుసుకున్నారు. నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మఝి జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యా మందిరం సందర్శించారు.

## బ్రాహ్మణ మహాసంఘ కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

రాయగడ: జిల్లాలోని అంబొదలలో ఒడిశా బ్రాహ్మణ మహా సంఘం కార్యాలయం ప్రారంభమైంది. ప్రముఖ న్యాయవాది, బ్రాహ్మణ మహాసంఘం రాయగడ జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్ పాడి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషోర్‌చంద్ర పండా, సుబ్రా పండ, అరుణ్ పాణిగ్రహి తదితరులు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజాభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. నిరుపేద బ్రాహ్మణులను ఆదుకునేందుకు నిధులను సమకూర్చి వారికి అందేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

## మంచం కింద భార్య శవం



నబరంగ్‌పూర్ జిల్లా చందాహండిలో మూసి ఉన్న ఇంట్లో మంచం కింద పెట్టెలో బయట పడిన మహిళ మృతదేహం

కొరాపుట్: మంచం కింద పెట్టెలో భార్య శవం పెట్టి భర్త పరారైన సంఘటన సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి హల్ది గ్రామంలో వెలుగు చూసింది. రెండు రోజుల నుంచి తమ కూతురు అనితా స్వయ్ (25) నుంచి సమాచారం లేదని ఆమె బంధువులు చందాహండి పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేశారు. అనుమానంతో పోలీసులు గ్రామస్తుల సమక్షంలో రెండు రోజులుగా తాళం వేసి ఉన్న ఆమె ఇంటిని బలవంతంగా తీసి లోపలకి వెళ్లారు. అక్కడ మంచం కింద అనిత మృతదేహం కనిపించింది. ఆమె భర్త దుష్మంత్ నాయక్ రెండు రోజులుగా పరారీలో ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



జయపూర్ గ్రీవెన్ సెల్ లో ఆరోపణలు చేస్తున్న కేశవ్ షడంగి,వేదిక మీద సబ్ కలెక్టర్,ఎస్‌డిపిఓ లు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ జరిగాయి. చందాహండి సమితి కేంద్రంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. 38 ఫిర్యాదులు స్వీకరించారు. ఇద్దరు దివ్యాంగులకు వీల్ చైర్‌లు, 18 మంది వృద్ధులకు పింఛన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీ మహిర్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఆటలాడుకుంటున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి

## తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తల్లిదండ్రులతో బాలుడు

జయపురం: జయపురం బెల్ రోడ్డులో నివాసముంటున్న బొరిగుడ సూరి కుమారుడు చరణ్ కుమార్(12) ఎనిమిది రోజుల కిందట కిడ్నాప్‌కు గురైన సంగతి తెలిసిందే. కర్ణాటక చిరంజీవి యువ వాహిణీ సహకారంతో బాలుడు ఎట్టకేలకు ఇంటికి క్షేమంగా చేరాడు. దుండగులు తనను భువనేశ్వర్, అక్కడి నుంచి బెంగళూరు తీసుకెళ్లారని, రైల్వే పోలీసులు రావడంతో తనను వదిలేసి పరారయ్యారని చెప్పారు.

## రోడ్డెక్కిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

- 28 నుంచి సమ్మెకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం పెంచాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ వారంతా సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అంతకుముందు జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు డచ్ భవనం వద్ద సమావేశం నిర్వహించి ధర్నా చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సీఎం, డిప్యూటీ సీఎంలు మోసం చేశారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఉద్యోగులుగా గుర్తించడం లేదని, 2016 నుంచి ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేధింపులు పెరిగాయన్నారు. చెప్పిన పనులు చేయకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. మరో పది రోజుల్లో తమ సమస్యలు పరిష్కరించకపోతే విధులు బహిష్కరిస్తామన్నారు. ఈ నెల 16 నుంచి దశల వారీగా అధికారులకు తమ గోడు వినిపిస్తున్నామని, ఈ నెల 28 నుంచి విధులను పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, పి.రామస్వామి, ధర్మారావు, సూర్యచంద్ర, పెద్ద ఎత్తున ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఆదివారం ఢీ కొన్నాయి. దీంతో ఈ ప్రమాదంలో సోరు శంకరనారాయణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఈయన పొన్నాడ నుంచి శ్రీకాకుళం వైపు బైక్‌పై వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్చారు. క్షత గాత్రుని ఫిర్యాదు, వైద్య నివేదిక ఆధారంగా ఎచ్చెర్ల పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

# పరిమితి పెరిగిందోచ్



వరి పంట


- 10 నుంచి 20 శాతం పెరిగిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
- వరికి రూ. 52 వేలు వరకు రుణానికి అవకాశం
- మొక్కజొన్నకు రూ.47 వేలు
- వేరు శనగకు రూ.41 వేలు
- బ్యాంకుల్లో ప్రారంభమైన పంటరుణాల రెన్యువల్స్

నరసన్నపేట: ఖరీఫ్, రబీల్లో పంటల వారీగా రైతులకు ఎంత మొత్తంలో రుణాలివ్వాలనే అంశంపై గరిష్ట రుణ పరిమితి (స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్) ఖరారైంది. గత ఏడాది కంటే ఈ ఏడాది అన్ని పంటలకు రుణ పరిమితి 10 నుంచి 20 శాతం వరకు పెరిగింది. ఏటా వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతుండటంతో బ్యాంకు రుణాల పరిమితిని కూడా పెంచుతున్నారు. దీంట్లో భాగంగా రానున్న ఖరీఫ్, రబీ సీజన్‌లకు గరిష్ట రుణపరిమితి నిర్ణయించారు. ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో బ్యాంకుల్లో కొత్త రుణాల పంపిణీ, పాత రుణాలు రెన్యువల్స్‌ను బ్యాంకర్లు ప్రారంభించారు.

**పంటల వారీగా రుణపరిమితి ఇలా..**

వర్షాధారం, నీటి వసతి కింద ఉన్న పొలాలకు వేర్వేరుగా పరిమితిని నిర్ధారించారు. వరికి గత సంవత్సరంలో ఎకరాకు రూ.46 వేలు రుణం ఇవ్వగా, దీన్ని ఈ ఖరీఫ్‌కు రూ.52వేలు చేశారు. రబీలో అయితే రూ.55 వేలు, విత్తన వరికి అయితే రూ.55 వేలు ఇవ్వనున్నారు. అలాగే వేరు శనగకు వర్షాధారం అయితే ఎకరాకు రూ.38 వేలు, కాలువ కింద పొలాలు అయితే రూ.41 వేలు, పత్తికి రూ.51 వేలు, మొక్క జొన్నకు రూ.47 వేలు, మినుము పంటకు రూ.30 వేలు, పెసలకు రూ.24వేలు, ఆయిల్ పామ్‌కు రూ. 70 వేలు, పచ్చి మిరపకు రూ.1.10 లక్షలు, రెడ్ మిరపకు రూ. 1.75 లక్షలు, చెరుకుకు రూ.80 వేలు, హైబ్రీడ్ టమాటాకు రూ.78 వేలు, వంకాయకు రూ.54 వేలు, బెండకు రూ.36 వేలు, అరటి ఎకరాకు రూ.1.10 లక్షలు, కొబ్బరికి రూ.70 వేలు, గడ్డి సాగుకు రూ.36 వేలు, బంతి పూల సాగుకు రూ.55 వేలు, వాటర్ మిలన్‌కు రూ.54 వేలు ఇలా మొత్తం 110 పంటలకు రుణ పరిమితిని నిర్ధారించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### బ్యాంకర్లకు సమాచారం ఇచ్చాం



పెరిగిన రుణపరిమితి వివరాలపై బ్యాంకులకు సమాచారం ఇచ్చాం. దీని ప్రకారం బ్యాంకర్లు రుణాలు రెన్యువల్ చేయడం, కొత్తవి ప్రాసెస్ చేయడం ప్రారంభించారు. ఈ ఏడాది మరింత విరివిగా బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వనున్నాం.

– సూర్యకిరణ్, ఎల్‌డీఎం

# నబరంగ్‌పూర్ టవర్ క్లబ్ పునరుద్ధరణ



ప్రారంభోత్సవంలో జగన్నాథరావు, సభ్యులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో సుమారు 20 ఏళ్ల చరిత్ర కలిగిన బ్యాడ్మింటన్ టవర్ క్లబ్ పునరుద్ధరణ జరిగింది. సోమవారం జిల్లా కేంద్రంలో ఆర్‌ఓ స్క్వేర్‌లో క్లబ్ అధ్యక్షుడు కె.జగన్నాథరావు ప్రారంభించారు. సభ్యుల వ్యక్తిగత చందాల ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి అధునాతన సదుపాయాలతో పునర్నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు రవి పట్నాయక్, టింకు జైన్, ప్రదీప్ మిశ్రా, పొట్నూరు మణి, తేజూ రావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తయిన డబ్లింగ్ పనులు



పాడువా వద్ద చివరి దశలో డబ్లింగ్ పనులు

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వే మార్గంలో పాడువా–దర్లిపుట్ స్టేషనల మధ్య డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రానికి ఈ నిర్మాణ కార్యక్రమం ముగిసింది. మంగళవారం ఈ మార్గంలో ట్రయల్ రన్ జరగనుంది. ఈ మార్గంలో ఇప్పటికే దర్లిపుట్ నుంచి షిమిలిగుడ వరకు నిర్మాణం పూర్తయ్యింది. మరోవైపు పాడువ నుంచి సుక్కు వరకు డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. సుక్కు వద్ద వంతెన నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. దాదాపు 85 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి.

## సఫాయి కార్మికుడు మృతి

- ఇంట్లో వెలుగు చూసిన నోట్ల కట్టలు



దోంబురు (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో మల్కన్‌గిరిలో నివాసముంటున్న సఫాయి కార్మికుడు డోంబురు గరడ (55) గుండె పోటుతో సోమవారం వేకువజామున మృతిచెందాడు. ఇతనికి వివాహం కాలేదు. మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కరెంట్ కూడా లేని ఓ చిన్న ఇంట్లో నివాసముంటున్నాడు. మృతి సమాచారం తెలిసి హాజరైన బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఓ బ్యాగు నిండా నోట్ల కట్టలు కనిపించాయి. కొంత బంగారం కూడా గుర్తించారు.



ఇంట్లో లభ్యమైన నగదు

## అనాథాశ్రమానికి వితరణ



పుస్తక సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నంధాహండి సమితి సింధీగుడ అనాథ ఆశ్రమం బాలలకు సోమవారం పలు దేవాలయాలలో సేవలు చేస్తున్న యువకులు సాయం అందించారు. హనుమాన్ మందిరంలో విందు భోజనాలు వండి బాలలకు అందజేశారు. పుస్తక సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అశోక్ త్రిపాఠి, జితేంద్ర దాస్, సుమిత్ పాలో, రంజన్ త్రిపాఠి, సత్యనారాయణ బెహరా, తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ బాలలతో యువజన సభ్యులు

# 110 గ్రామాల్లో నాటుసారా ప్రభావం



టెక్కలి ఎక్సైజ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రామచంద్రరావు

టెక్కలి: జిల్లాలో 6 ఎక్సైజ్ కార్యాలయాల పరిధిలో 110 గ్రామాల్లో నాటు సారా ప్రభావం ఉన్నట్లు గుర్తించామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ పి.రామచంద్రరావు వెల్లడించారు. సోమవారం టెక్కలి ఎక్సైజ్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి విలేకర్లతో మాట్లాడారు. కొత్తూరు, హిరమండలం, నందిగాం, మెళియాపుట్టి, పలాస, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో నాటు సారా ప్రభావం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యధికంగా సోంపేట, టెక్కలి ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో గల మండలాల్లో 70 గ్రామాల్లో నాటు సారా ప్రభావం ఉందన్నారు. జూన్ నాటికి సారా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేకంగా నవోదయం కార్యక్రమంతో ఇప్పటికే 190 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఏసీ పేర్కొన్నారు. గతంలో నాటుసారా అమ్మకాలు చేసిన 1224 మందిని గుర్తించి వారిలో 724 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. నాటు సారా తయారీ, విక్రయాలను మానేస్తే అలాంటి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. అలాగే నాటుసారాకు అవసరమైన బెల్లం ఊటలను విక్రయించేవారిలో 58 మందిని గుర్తించామని వారిలో 22 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఏసీ రామచంద్రరావు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 838 బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకున్నామని, వాటిలో భాగంగా 1314 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పలాసలో అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేసిన దుకాణంపై రూ.5 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. నాటు సారా అమ్మకాలు, అధిక ధరలకు మద్యం అమ్మకాలు, ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తరలింపు, బెల్టు దుకాణాలు నిర్వహిస్తే తక్షణమే 14405 టోల్‌ఫ్రీ నంబరుకు గాని, 94409 02332 ఫోన్ నంబరుకు సమాచారం అందజేయాలని కోరారు. ఆయనతో పాటు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్, సిబ్బంది ఉన్నారు.

## అక్రమంగా గ్రావెల్ తరలింపు



గ్రావెల్ అక్రమంగా తరలించిన కొండ అంచు భాగం

సారవకోట: మండలంలోని జమచక్రం గ్రామం నుంచి సత్రాం పంచాయతీ గొల్లపేట వెళ్లే మార్గంలో సర్వే నంబర్ 42 కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ మార్గంలో కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు వినియోగించుకునేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు పక్కనే ఉన్న కొండ నుంచి గ్రావెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా తరలించుకుంటున్నారు. ప్రస్తుతం అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న కొండ నుంచి సచివాలయం కూత వేటులోనే ఉన్నా సంబంధిత రెవెన్యూ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరించడం విచారకరం. దీనిపై స్థానిక వీఆర్వో రామును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## క్లుప్తంగా

### విశ్రాంత హోంగార్డుకు 'చేయూత'



రామారావుకు చేయూత కింద చెక్ అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : పోలీసు శాఖలో హోంగార్డుగా పని చేసి ఇటీవల పదవీ విరమణ పొందిన కాజా రామారావుకు చేయూత కింద రూ.3లక్షలు సోమవారం అందజేశారు. డీపీఓలో ఎస్పీ వకుల్ జిందల్ తన చాంబర్‌లో హోంగార్డు సిబ్బంది ఒక్క రోజు కేటాయించిన డ్యూటీ అలవెన్స్‌ను రామారావుకు చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందిలో ఐక్యమత్యానికి ఇలాంటి సాయాలు మరింత దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఏ శ్రీనివాలస రావు, హోంగార్డ్స్ ఇంచార్జ్ ఆర్ఐ రమేష్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం



సారిపల్లి గ్రామ పెద్దలకు నగదు అందిస్తున్న బొత్స చైతన్య

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బొత్స లక్ష్మణరావు తనయుడు బొత్స చైతన్య రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సోమవారం విజయనగరంలోని తన నివాసంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు తన వంతుగా నగదు అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### బెల్లం ఊట ధ్వంసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా తయారీకి ఉపయోగించిన డ్రమ్ములు

వీరఘట్టం: మండలంలోని చిన్నగోర శివారు ప్రాంతంలో సారా తయారు చేసేందుకు ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటలను సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్.ఐ జి.కళాధర్ తెలిపారు. సారా తయారీ చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో వెళ్లగా సారా తయారీదారులు పరారైనట్లు ఎస్.ఐ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

### మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

పూసపాటిరేగ : భోగాపురం మండలం ముక్కాం గ్రామంలో అనధికారంగా 12 మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో నాలుగు నెలల కాలంలో 38 అనధికార మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసి 355 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### 918 లీటర్ల సారా ధ్వంసం



సారాను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: గతంలో పలు కేసుల్లో పట్టుబడిన సారా, మద్యం సోమవారం ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణ శివారుల్లో 918 లీటర్ల సారా, 17 లీటర్ల మద్యం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా రవాణా, తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. క్రమం తప్పకుండా దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో సారా కేసులో పరారీలో ఉన్న పట్టణానికి చెందిన కోలా విజయ్, పాలకొండ కార్తీక్, కోలా పెంటయ్యలను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పదే పదే సారా కేసుల్లో పట్టుబడుతున్న బోమ్మాలి శ్రీనివాసరావు బైండోవర్ ఉల్లంఘించిన కారణంగా తహసీల్దార్ ఆధ్వర్యంలో రూ.40 వేలు జరీమానా చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు యు.నాగేశ్వరరావు, రేవతమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

దెంకాడ: రైతులు ప్రకృతి విధానంలో పండించిన పంటలు ఆరోగ్యకరమని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. ఏపీసీఎన్ఎఫ్, సెర్ప్, ఎఫ్‌పీవో సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్‌ను మండల వెలుగు కార్యాలయం ఆవరణంలో సోమవారం ఏర్పాటు చేశారు. దీనిని ఏపీఎం శ్రీనివాస్ పరిశీలించారు. కొనుగోలుదారులకు కూరగాయలను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో ఏపీఎం గురుమూర్తి, ఐసీఆర్‌పీ సభ్యులు శ్రీదేవి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

- గరివిడి టీడీపీ క్యాడర్‌లో ముసలం
- ఏడాది తిరగక ముందే తమ్ముళ్ల మధ్య లుకలుకలు
- గరివిడి గోశాలలో వేర్పాటు సమావేశం
- మండల నాయకత్వంపై తిరుగుబావుటా
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు తీర్మానం

# తాడో.. పేడో.. తేల్చుకుందాం..



చీపురుపల్లి: 'అంతా ఆ ఇద్దరి ఇష్టమేనా.. మిగిలిన వారెవ్వరూ పనికి రారా... ఆ ఇద్దరు ఎలా చెబితే అలా నడుచుకోవాలా... ఆ ఇద్దరు చెబితేనే అధికారుల పని చేయాలా.. వేదికలపై అవమానించినా భరించాలా... అధికారులను సైతం ఆ ఇద్దరు ఇష్టానుసారంగా భయపెడుతూ పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నా పట్టించుకోరా... ఆ ఇద్దరే కావాలో లేక మనం కావాలో తేల్చుకుందాం... ఈ సారి మండల పార్టీ అధ్యక్ష పదవి తూర్పుకాపు సామాజిక వర్గానికే ఇవ్వాలి.. నేరుగా ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దగ్గరే తాడో పేడో తెల్చుకుందాం..' ఇదీ గరివిడి మండలంలో టీడీపీ మండల నాయకత్వానికి వ్యతిరేకంగా ఓ సీనియర్ లీడర్, మాజీ వైస్ ఎంపీపీ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆధ్వర్యంలో గరివిడి మండల పరిషత్ కార్యాలయానికి అతి సమీపంలోని ఓ టీడీపీ నేత గోశాలలో క్యాడర్ ఆదివారం రాత్రి రహస్యంగా నిర్వహించిన వేర్పాటు సమావేశంలో హాజరైన పది పంచాయతీలకు చెందిన దాదాపు 35 మంది నాయకులు కలిసి చేసుకున్న తీర్మానం.

మొత్తం మీద సరిగ్గా ఏడాది తిరగక ముందే అధికార టీడీపీ క్యాడర్‌లో విబేధాలు భగ్గుమంటున్నాయి. ఏడాది కాలంలో క్యాడర్‌లో గ్రూపులుగా విడిపోయి ఆధిపత్యం కోసం సమావేశాలు నిర్వహించుకునే స్థాయికి వచ్చాయి. దీనికి గరివిడి మండల టీడీపీలో ముసలం చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల కోసం పట్టించుకునే తీరిక లేని టీడీపీ క్యాడర్ ఇలా ఆధిపత్యం కోసం వెంపర్లాడుతున్న తీరును చూసి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఆ ఇద్దరు కావాలా.. మేం కావాలా..?**

గరివిడి మండలంలోని టీడీపీలో ఆ ఇద్దరు నాయకత్వం వహిస్తున్నారు. ఇద్దరూ ఒక్కటై పార్టీ క్యాడర్‌పై సొంతంగా రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతున్నారనేది అసమ్మతి వర్గం రహస్య సమావేశంలో మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. పలు రకాల పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినా తాము కూడా వారితో ఫోన్‌లు చేయించుకుంటే తప్ప పనులు జరగకపోవడం అన్యాయమనేది అసమ్మతి వర్గం సమావేశంలో చర్చించుకున్నట్లు సమాచారం. అందుకనే ఆ ఇద్దరు కావాలో లేక తాము కావాలో తేల్చేయాలని అధిష్టానం వద్దకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

**మండల పార్టీ అధ్యక్ష పదవి కాపులకు ఇవ్వాల్సిందే...**

మరికొద్ది రోజుల్లో మండల పార్టీ అధ్యక్ష పదవుల కేటాయింపులు జరగనున్న నేపథ్యంలో అసమ్మతి వర్గం ఈ రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇంతవరకు గరివిడి మండల పార్టీ అధ్యక్షుడిగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఓ నాయకుడు వ్యవహరిస్తున్నారు. ఈ సారి కూడా ఆయన్నే కొనసాగించేందుకు అధిష్టానం మొగ్గు చూపుతోందని తెలుసుకున్న అసమ్మతి వర్గం రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ దఫా మండల పార్టీ అధ్యక్ష పదవిని తూర్పు కాపులకే ఇవ్వాలనే డిమాండ్ అధిష్టానం ముందు ఉంచాలని రహస్య సమావేశంలో తీర్మానం చేసుకున్నట్లు సమాచారం.

## విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు లాప్‌ట్యాప్‌లు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయో వృద్ధులు సహాయ సంస్థ వారి ఆర్థిక సౌజన్యంతో రూ.63 లక్షల విలువ గల రుణాలను 18 మంది దివ్యాంగులకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ వారి ద్వారా డిగ్రీ ఆపై కోర్సులు రెగ్యులర్‌గా చదువుతున్న 29 మంది దివ్యాంగులకు రూ.11.60 లక్షలు (ఒక్కొక్కరికి రూ.40 వేలు) 29 ల్యాప్‌టాప్‌లు, మూగ, చెముడు అభ్యర్థులకు రూ.60 వేలు విలువ గల 6 టచ్ ఫోన్‌లు, మూడు చక్రాల సైకిళ్లు 2, వీల్‌చైర్లు 2, పంపిణీ చేశారు.

## బాల్య వివాహాలు అరికట్టాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: బాల్య వివాహాలు అరికట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల పట్ల విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రుల నుంచి అంగీకారం పొందాలని అందుకు బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాల గూర్చి స్పష్టంగా వివరించాలన్నారు. వివిధ కుటుంబ పరిస్థితులు, సామాజిక పరిస్థితుల రీత్యా బాల్య వివాహాలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సామాజిక స్థితిగతుల పట్ల వివరంగా చెప్పాలని ఆదేశించారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల బాల్యం కొల్పోతారని, చదువు, ఆరోగ్యం కోల్పోతారని. వారికి ఉన్న ఆశలు, ఆశయాలు సాధించే అవకాశం కోల్పోయే పరిస్థితులు ఎక్కువగా ఉంటుదన్నారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

**తాగు నీటి సమస్య తలెత్తరాదు**

జిల్లాలో తాగు నీటి సమస్య తలెత్తరాదని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని మండలాల్లో తాగునీటి సమస్య తలెత్తుతున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని, వాటి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తక్షణం పునరుద్ధరించాలని ఆదేశించారు.

## యశ్వంత్‌కి బంగారు పతకం




బంగారు పతకం అందుకుంటున్న యశ్వంత్

విజయనగరం అర్బన్: విద్యా శాఖ, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ రాష్ట్ర స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ సంయుక్త నిర్వహణలో సోమవారం నూజివీడు హిల్ పారడైజ్ స్కూల్ అగిరిపల్లిలో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్–2025 క్రీడా పోటీలలో తొలి రోజున జిల్లాకు చెందిన ఇనుముల యశ్వంత్ 50 మీటర్ల క్రిపుల్డ్ వాక్ క్రీడాంశంలో బంగారు పతకాన్ని సాధించాడు. ప్రజ్ఞా వైకల్యం, ఆటిజం, డౌన్ సింగ్రోమ్, మస్తిష్క పక్షవాతం వైకల్యాలున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఈ నెల 23 వరకు జరిగే ఈ పోటీలలో జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొంటున్నారని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు తెలిపారు. తొలి రోజు బంగారు పతకం సాధించిన యశ్వంత్ తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి అని తెలిపారు. విజేతను డీఈఓ యు.మాణిక్యం నాయుడు, సెక్టోరియల్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బోధన సిబ్బంది అభినందించారు.

## పోక్సో కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని తమరాం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన కోరుకొండ విజయ్‌కుమార్ దాడి చేయడంతో పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. తమరాం గ్రామంలో పక్క పక్క ఇళ్లల్లో నివసిస్తున్న విజయ్‌కుమార్ భార్య పద్మ, బాలిక ప్రతిరోజు మాట్లాడుకుంటుండడంతో బాలిక తన భార్యకు ఏదో చెడుగా చెబుతుందనే అనుమానంతో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో విజయ్‌కుమార్ బాలికపై దాడి చేశాడు. తనపై దాడి చేశాడని బాలిక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.

## చేపల మృత్యువాత



కోనేరు చెరువులో మృతి చెందిన చేపలను బయటకు తీస్తున్న మత్స్యకారులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని సంతకోనేరు చెరువులో నాలుగు రోజులుగా చేపలు మృత్యువాత పడుతున్నాయి. సోమవారం వందల సంఖ్యలో చేపలు మృతి చెందడాన్ని గమనించిన మత్స్యకారులు దుర్గారావు, కామయ్య, శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులో రూ.1.20లక్షల వరకు పెట్టుబడి పెట్టి చేపలను పెంచుతున్నామని, కొద్ది రోజుల్లో చేతికంది వచ్చే సమయంలో ఇలా మృత్యువాత పడడంతో తీవ్రంగా నష్టపోయామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న డ్రైనేజీ నుంచి వచ్చే నీరు చెరువులో కలవడం వల్లే చేపలు మృతి చెందుతున్నాయని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని, నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు. సమాచారం తెలుసుకున్న వైస్ సర్పంచ్ ఆదిల్, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు చెరువును పరిశీలించారు. డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా దారి మళ్లించే చర్యలు తీసుకున్నారు.

### రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



శ్రీహరి (ఫైల్)

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన కొండపల్లి శ్రీహరి(22) సోమవారం సాయంత్రం గున్నతోటవలస గ్రామం వద్ద బొబ్బిలి నుంచి విజయనగరం వైపు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి మరణానికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడు శ్రీహరి తండ్రి శ్రీను డ్రైవర్ కాగా శ్రీహరి టాటా మేజిక్ వాహనాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీహరికి సోదరుడు తేజ విద్యాభ్యాసం చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు.

### ఉరి వేసుకొని వ్యక్తి మృతి



ఉరి వేసుకొని మృతి చెందిన రాజేష్

పూసపాటిరేగ : మండల కేంద్రమైన పూసపాటిరేగ వాటర్ ట్యాంకు సమీపంలో అప్పులు బాధ తట్టుకోలేక అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఉరి వేసుకొని సోమవారం ఉదయం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... స్థానికులు బంధువులు అందించిన వివరాల మేరకు విజయవాడకు చెందిన కొమ్ముకూరి రాజేష్ (35) గత కొంత కాలంగా పూసపాటిరేగ పెట్రోల్ బంకు సమీపంలో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల కాలంలో హోటల్ నిర్వహణలో నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. భార్య నెలరోజులు క్రితం పుట్టింటికి వెళ్లిపోవడంతో రాజేష్ ఒక్కడే ఇంట్లో వుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. రాజేష్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు వున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. పూసపాటిరేగ ఎస్ఐ ఐ.దుర్గాప్రసాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇళ్లపైకి దూసుకెళ్లిన ట్యాంకర్ లారీ



బొండపల్లి వద్ద ఇళ్లపైకి దూసుకు వెళ్లిన లారీ

బొండపల్లి: జాతీయ రహదారి 26కు ఆనుకొని ఉన్న ఇళ్లపైకి అదుపు తప్పి వేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ సోమవారం దూసుకెళ్లింది. ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి బొండపల్లిలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఒక స్లాబ్ ఇంటితో పాటు పక్కనే ఉన్న పూరిళ్లపైకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న వారు భయంతో పరుగులు తీశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి రహదారి పక్కనే గల చింత చెట్టుతో పాటు ఇళ్లను ఢీకొని నిలిచిపోయింది. హైవే పెట్రోలింగ్ వాహనం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

## పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- రెవెన్యూ అర్జీలే ఎక్కువ



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికకు అర్జీదారుల తాకిడి

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతులు పరిష్కార వేదికకు అర్జీదారుల తాకిడి వెల్లువెత్తింది. జిల్లా కేంద్రాలకు అర్జీదారులు రావాల్సిన పని లేకుండా గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుల పేరుతో దాదాపు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల ప్రభావం కనపడలేదు. సదస్సుల్లో పరిష్కారం దొరక్క ఎప్పటిలాగే అర్జీదారుల తాకిడి పెరిగింది. సోమవారం పరిష్కార వేదికకు 205 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా 138 వినతుల వరకు రెవెన్యూ శాఖకు చెందినవే ఉన్నాయి. తరువాత స్థానంలో పింఛన్లు మంజూరు చేయాలని డీఆర్డీఏకు 22, పంచాయతీకి 10, మున్సిపాలిటీకి చెందినవి 8, విద్యా శాఖకు 8, వైద్య శాఖకు 6, హౌసింగ్‌కు 3, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. అర్జీల స్వీకరణ ప్రక్రియలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తోపాటు, జేసీ సేతు మాధవన్, డీఆర్ఓ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ గడువు లోపలే వినతులను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. రీ ఓపెన్ కేసులు ఉండకుండా పరిష్కారాలు స్పష్టంగా ఉండాలని సూచించారు.

## అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడండి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- పీజీఆర్ఎస్‌కు 147 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: పీజీఆర్ఎస్‌కు వచ్చిన వినతులు సొంత సమస్యలుగా భావించి పరిష్కార దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 147 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేసే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు తావివ్వద్దన్నారు. పరిష్కారమయ్యే సమస్యలతో అర్జీదారులు సంతృప్తి చెందాలని పునఃప్రారంభం కారాదని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డీఆర్ఓ హేమలత, ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**అర్జీలలో కొన్ని ఇలా..**

- 25 కుటుంబాల నివాసం ఉండే గుమ్మలక్ష్మీపురం మండలం కొండబిన్నిడి గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక అత్యవసర పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఆ గ్రామానికి చెందిన గిరిజనులు వినతిని అందజేశారు.
- కురుపాం మండలం పెద్దగొత్తిలిలో సచివాలయం, రైతు భరోసా కేంద్ర నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయని, ప్రస్తుతం పాత పంచాయతీ భవనం పాడవ్వడంతో వర్షం నీరు కారుతుందని, పరిపాలనకు ఆటంకం కలుగుతుందని, నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామ సర్పంచ్ పి.టి.లోకనాధం వినతిని అందజేశారు.

## పరిశీలించి పరిష్కరించాలి

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లా పోలీసు శాఖ కార్యాలయానికి ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులను, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఫిర్యాదులు వాస్తవాలైతే చట్టపరమైన చర్యలతో పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కుటుంబ కలహాలు, భర్త అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూళ్లు, ప్రేమ పేరుతో మోసాలపై పలు అర్జీలు ఎస్పీ స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అనంతరం వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన స్టేషన్ సిబ్బందికి ఎస్పీ స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడి ఆ ఫిర్యాదులను వాటి పూర్వాపరాలను విచారణ చేసి వాస్తవాలు రుజువైనట్లైతే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం మొత్తం 14 ఫిర్యాదులు జిల్లా పోలీసు శాఖ కార్యాలయానికి అందాయి. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్ఐ ఫ్రక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 25 ఫిర్యాదులు





డీపీఓలో ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

విజయనగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 25 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో భూతగాదాలకు సంబంధించి 17, కుటుంబ కలహాలకు సంబంధించి రెండు, మోసాలకు పాల్పడినవి నాలుగు, ఇతర అంశాలకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి. వీటికి స్పందించిన ఎస్పీ వకుల్ జిందల్ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐలు లీలారావు, చౌదరి, డీఎస్ఆర్‌పీ ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

- విజయనగరం క్రైం

## అట్రాసిటీ కేసుపై డీఎస్పీ దర్యాప్తు



ఆర్‌కే కాంప్లెక్స్‌లో సెల్‌ఫోన్‌లో నమోదైన సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొగిరి సురేష్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సోమవారం దర్యాప్తు చేశారు. ఘటన జరిగిన ఆర్‌కే కాంప్లెక్స్ వద్దకు చేరుకుని తొలుత ఫిర్యాదుదారుడు చిత్తిరి నాగరాజు వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంప్లెక్స్‌లో అమర్చిన సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వెంట ఎస్సై వై.రవికిరణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

విజయనగరం క్రైం : ఏడాది క్రితం జిల్లాలోని బొబ్బిలిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రెండు వేలు జరీమానాను పోక్సో న్యాయమూర్తి నాగమణి సోమవారం విధించారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు... పార్వతీపురం జిల్లా గుమ్మలక్ష్మీపురానికి చెందిన 16ఏళ్ల బాలిక ఏకలవ్య పాఠశాలలో చదువుతోంది. తన అవసరాల కోసం మామయ్యను డబ్బులు అడగగా బొబ్బిలిలో ఉంటున్న తన స్నేహితుడికి వద్దకు వెళ్లి తీసుకోమని చెప్పారు. బొబ్బిలిలో ఉన్న మామయ్య స్నేహితుడు మోహన్‌కు సదరు బాలిక కలిసి డబ్బులు అడిగింది. అయితే డబ్బులు ఇస్తానని చెప్పిన మోహన్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన దారుణంపై పార్వతీపురం వచ్చి తన మామయ్యకు చెప్పడంతో వెంటనే 112కి ఫిర్యాదు చేశారు. పార్వతీపురం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బొబ్బిలికి బదిలీ చేశారు. బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ పోక్సో కేసు నమోదు చేశారని ఎస్పీ చెప్పారు.

ఆరు మాసాలలో కేసు ప్రాసిక్యూషన్‌ను పూర్తి చేసి కోర్టులో ఆధారాలు సమర్పించడంతో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్టు రుజువు కావడంతో పోక్సో న్యాయమూర్తి నాగమణి నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానారావు వాదనలు వినిపించగా బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ మన్మధరావు, సీఎంఎస్ కానిస్టేబుల్ రామకృష్ణ సాక్షులను కోర్టులో హాజరు పరిచారని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.